# సాక్షి ప్రకాశం

మంగళవారం, 22, ఆగస్టు, 2023






**సత్వరమే పరిష్కారం**

స్పందనలో వచ్చే ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ సిబ్బందిని ఆదేశించారు.

- 8లో..



**మంటగలిసిన మాతృత్వం**

తల్లిపొత్తిళ్లలో సేదతీరాల్సిన పసికందును ఆర్టీసీ బస్సులో ఓ బ్యాగులో వదిలేసి వెళ్లిందో మహిళ. సోమవారం ఈ ఘటన జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం 35/29

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**ఒంగోలు అర్బన్:** దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దోమల వలన మలేరియా వ్యాప్తి చెందుతుందని దీంతో పాటు పలు రకాల వ్యాధులు వస్తాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు పంచాయతీలు, మున్సిపాలిటీలు కూడా దోమల నివారణలో సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నివారణ కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 19 నుంచి డీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు

**ఒంగోలు:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ నాలుగో సెమిస్టర్ 2021–23 బ్యాచ్ విద్యార్థులకు, గతంలో ఫెయిలైన విద్యార్థులకు సెప్టెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఒక సబ్జెక్టుకు రూ.125, రెండు సబ్జక్టులకు రూ.150, మూడు సబ్జక్టులకు రూ.175, నాలుగు నుంచి 6 సబ్జక్టుల వరకు రూ.250లు ఆగస్టు 30వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుముతో సెప్టెంబర్ 7వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుముతో చెల్లించవచ్చన్నారు.

### సెల్‌ఫోన్ రిపేరు కోసం ఉచిత శిక్షణ

**ఒంగోలు సబర్బన్:** సెల్ ఫోన్ రిపేరు కోసం ఆసక్తి కలిగిన వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (రూడ్ సెట్) డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఒంగోలు భాగ్య నగర్‌లోని టీటీడీసీ ప్రాంగణం సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయంలో 4, సెప్టెంబర్, 2023 నుంచి 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ప్రత్యేకంగా పురుషులు, యువకులకు మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఈ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితంగానే అందిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 95733 63141 సెల్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చన్నారు.

### తుది మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో

**ఒంగోలు అర్బన్:** వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నేషనల్ హెల్త్ మిషన్‌లో ఖాళీగా ఉన్న సైకాలజీ పోస్టు భర్తీ చేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది మెరిట్ జాబితా ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్ prakasam.ap.gov.in లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలుంటే 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు లిఖిత పూర్వకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించరని స్పష్టం చేశారు.

# ఆధ్యాత్మిక ప్రకాశం

కలియుగ వైకుంఠనాథుని వైభవాన్ని దశ దిశలా చాటుతూనే.. ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను విస్తృతం చేయాలన్న ధృడ సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) పాలకమండలి పూర్వ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి అడుగులు వేశారు. నాలుగేళ్ల పాటు శ్రీవారి సేవలో తరించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న ఆయన ఉమ్మడి ప్రకాశంలో టీటీడీ ఆధ్యాత్మిక, ధార్మిక సేవలను విస్తృతం చేశారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చిన్న చిన్న పట్టణాల్లో సైతం కల్యాణ మండపాలు, భజన మందిరాలు నిర్మించాలన్న బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణాలకు పునాదులు వేశారు.



దర్శిలో టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపనలో వైవీ, మద్దిశెట్టి, బూచేపల్లి (ఫైల్)



యర్రగొండపాలెంలో టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపనలో వైవీ సుబ్బారెడ్డి, మంత్రి సురేష్ (ఫైల్)

- సామాన్యుల చెంతకు శ్రీవారు
- నాలుగేళ్లు సుదీర్ఘకాలం పాటు టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డికి అవకాశం
- ఉమ్మడి జిల్లాలో టీటీడీ తరఫున విస్తృతంగా సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- కల్యాణ మండపాలు, భజన మందిరాలు, నూతన దేవాలయాల నిర్మాణాలు
- పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ
- టీటీడీ ధార్మిక సేవా కార్యక్రమాలకు జిల్లాలో రూ.35.45 కోట్లకు పైగా వెచ్చింపు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వెంకటేశ్వరస్వామి సేవలో తరిస్తూనే ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి. చైర్మన్‌గా ఆయన జూన్ 2019 నుంచి ఆగస్టు 2023 వరకు సుదీర్ఘకాలం పాటు కొనసాగే మహద్భాగ్యాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న కాలంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9 కల్యాణ మండపాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 64 భజన మందిరాలు నిర్మించాలన్న బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణంతో పాటు పలు పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టి హిందూ ధర్మప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.

**గ్రామీణ యువతలో ధర్మ ప్రచారాన్ని పెంపొందించే దిశగా...**

గ్రామీణ యువత భాగస్వామ్యంతో మారుమూల ప్రాంతాల్లో హింధూ ధర్మ ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు భజన మందిరాల నిర్మాణాలు చేపట్టారు. వీటి ద్వారా హింధూ ధర్మ ప్రచారాన్ని పల్లెపల్లెకూ విస్తరించేలా కార్యాచరణకు పూనుకున్నారు. అందుకోసం జిల్లాలో 64 భజన మందిరాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భజన మందిరాల నిర్మాణానికి రూ.6.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. వీటిలో గ్రామస్తులకు భజన, కోలాటం కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని అందజేయనున్నారు. ప్రధాన గ్రామాల్లో అయితే ఒకటో, రెండో అంతకు మించి అయినా దేవాలయాలు ఉంటాయి కనుక అలాంటి ప్రాంతాల్లో కాకుండా మారుమూల కాలనీల్లో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలతో పాటు గిరిజన తండాలులాంటి ప్రాంతాల్లో భజన మందిరాలు నిర్మించేందుకు పూనుకున్నారు.



అద్దంకిలో నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం

**దేవాలయాల కోసం రూ.11.85 కోట్లు**

జిల్లా వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణంతో పాటు పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ కోసం రూ.11.85 కోట్లు కేటాయించారు. నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా కొత్తగా ఆలయ నిర్మాణం, ఆలయ జీర్ణోద్ధరణ కోసం ఎమ్మెల్యేలు టీటీడీ పాలకమండలి అధ్యక్షుడిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డిని ఆశ్రయించారు. వారు అడిగిందే తడువుగా అనుమతులు ఇచ్చారు. కావాల్సిన ప్రాంతాల్లో నూతన దేవాలయాల నిర్మాణాలు చేపట్టారు. అదేవిధంగా ఆదాయం లేని, మరీ ఆదాయం తక్కువగా ఉన్న పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో రూ.6.09 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గంలో రూ.2,50,81,000, కందుకూరులో రూ.25 లక్షలు, కొండపిలో రూ.52 లక్షలు, మార్కాపురంలో రూ.5 లక్షలు, ఒంగోలులో రూ.9 లక్షలు, పర్చూరులో రూ.8.70 లక్షలు, సంతనూతలపాడులో రూ.1.50 కోట్లు, యర్రగొండపాలెంలో రూ.75 లక్షలు మంజూరు చేశారు.

**సామాన్యులకు అందుబాటులో...**

శ్రీవారి సేవలను సామాన్య భక్తుల చెంతకు చేరేలా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టారు వైవీ సుబ్బారెడ్డి. చిన్న,చిన్న పట్టణాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండేలా సుమారు రూ.17.20 కోట్ల వ్యయంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొమ్మిది కల్యాణ మండపాలు నిర్మింపతలపెట్టారు. పలు ప్రాంతాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం ద్వారా సామాన్య మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు అందుబాటులో ఉండటమే కాకుండా నిరంతరం జరిగే శ్రీవారి ధార్మిక కార్యక్రమాలు ఆయా ప్రాంతాల్లో భక్తులకు చేరువ కానున్నాయి. మేదరమెట్లలో కల్యాణ మండప నిర్మాణం పూర్తయింది. అందులో కళ్యాణ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల శుభకార్యాలు నిర్వహిస్తున్నారు. అలాగే దర్శి, ముండ్లమూరు, కనిగిరి, పామూరు, సింగరాయకొండ, త్రిపురాంతకం, నాగులుప్పలపాడు మండల కేంద్రంతో పాటు నాగులుప్పలపాడు మండలంలోని నూతలపాడులో కూడా కల్యాణ మండపాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

**ఎవరికీ భాగ్యం దక్కింది**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరికీ దక్కని అవకాశాన్ని నాకు కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి కల్పించారు. ఎవరికీ రాని విధంగా నాలుగు సంవత్సరాల పాటు ఆ శ్రీనివాసునికి సేవ చేసుకొనే అవకాశం దక్కింది. రాష్ట్రం, దేశంలోని ఎన్నో ప్రాంతాలతో పాటు దేశ విదేశాల్లో స్వామి సేవ చేసుకునే అవకాశాన్ని ఆ దేవదేవుడు కల్పించారు. దాంతో జిల్లాలోని దేవాలయాలు నిర్మాణాలకు, పునరుద్ధరణకు, ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు, కళ్యాణ మండపాల నిర్మాణాలకు, భజన మందిరాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే గొప్ప అవకాశం కలిగింది. ఆ ఏడుకొండల స్వామికి సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి, ప్రకాశం జిల్లా ప్రజలకు కృతజ్ఞుడనై ఉంటాను.

– ఒంగోలు మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి.

# ఆ పాపం టీడీపీదే

- ఇళ్లు మంజూరు కాకుండానే డబ్బులు ఎలా వసూలు చేస్తారు
- కట్టేది 4 వేల ఇళ్లు అయితే 14 వేల మంది వద్ద వసూలు చేయడం దారుణం
- మొత్తం రూ.14 కోట్లలో రూ.7 కోట్లు ఇప్పటికే తెప్పించాం...చెల్లింపులు మొదలు పెట్టాం
- మిగతా మొత్తం వచ్చేనెలలో చెల్లించడం తోపాటు ఇళ్లు మంజూరు కానివారికి ఇంటి పట్టా ఉచితంగా ఇవ్వబోతున్నాం
- డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు:** రోజు మొత్తం కష్టపడ్డా సాయంత్రానికి సొంత గూటిలో తలదాచుకోవాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం వైపు ఆశగా చూస్తారు. అటువంటి వారి ఆశలను సజీవంగా ఉంచాల్సింది పోయి వారినే వంచిస్తే, ఇంతకంటే దారుణం ఇంకేమైనా ఉంటుందా అంటూ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల పాపం ముమ్మాటికి తెలుగుదేశం పార్టీదే అని, అయినా ఆ సమస్యకు పరిష్కారం అద్భుతంగా చూపుతున్నామని బాలినేని పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో బాలినేనితో ఒక ప్రైవేటు కేబుల్ టీవీ నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో పలువురు ఫోన్లు చేసి టిడ్కో డబ్బులు అన్నా ఇప్పించండి... లక్ష కట్టాం... మేము రూ.75 వేలు కట్టాం అంటూ పేర్కొనడంతో వారి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపుతున్నట్లు బాలినేని ప్రకటించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు తన నివాసానికి వస్తే పత్రాలు చూసి సాయంత్రానికల్లా నగర పాలక సంస్థ కమిషనర్ ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజానీకం ఇంటి కోసం కట్టిన మొత్తం చెక్కు రూపంలో తిరిగి ఇప్పిస్తామని స్పష్టం చేశారు.



డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ వాస్తవానికి టీడీపీ వాళ్లు మొదలు పెట్టిన ఇళ్లు 4 వేలు అన్నారు. వాటికి కాకుండా 14 వేల మందికిపైగా ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని.. మరో 10 వేల మందికి ఇళ్లు ఎక్కడ చూపించాలన్నారు. అయితే ఈ విషయాన్ని ప్రజల వరకు వెళ్లకుండా జాగ్రత్తపడ్డారన్నారు. వాస్తవానికి ఎక్కడైనా ఇళ్లు మంజూరైతే లబ్ధిదారుడ్ని వాటా చెల్లించమని కోరతారు. రాష్ట్రం మొత్తం మీద అంతా అదే విధంగా జరిగింది ఒక్క ఒంగోలు మినహా అన్నారు. కనీసం ఇళ్లు మంజూరు కానప్పుడు ఆ డబ్బులు తిరిగి వాపసు చేసి ఉన్నా బాగుండేదని, కానీ అలా చేయలేదని చెప్పారు. ఆ డబ్బులు రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లి వారు వాటిని డైవర్ట్ చేయడంతో నిధుల లేమి సమస్య నెలకొందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశీలిస్తే అసలు విషయం బయటపడిందని వెల్లడించారు. మొత్తం రూ.14 కోట్ల బకాయిలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి రూ.7 కోట్లు తెప్పించామని వాటిని తిరిగి చెల్లిస్తున్నామని తెలిపారు. మిగతా రూ.7 కోట్లు కూడా తెప్పించి సెప్టెంబర్ నెలాఖరుకల్లా టిడ్కో ఇళ్లు మంజూరు కాకుండా డబ్బులు చెల్లించిన వారందరికీ తిరిగి చెల్లిస్తామన్నారు. అంతే కాకుండా ఇటువంటి వారు ఇన్నాళ్లు డబ్బులు ప్రభుత్వం వద్ద ఊరకనే ఉన్నాయని ఆవేదన చెందకుండా వారికి ఇంటి పట్టా మంజూరు చేస్తున్నామని, వారు ఇళ్లు కట్టుకునేందుకు రూ.2 లక్షలు ఉచితంగా కూడా ఇప్పిస్తున్నామన్నారు.

ఇక టిడ్కో ఇళ్ల నిర్మాణం కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని, డిసెంబర్‌లో వాటిని లబ్ధిదారులకు అందిస్తామన్నారు. దానికి సంబంధించిన ప్రక్రియ కూడా జరుగుతుందని తెలిపారు. టీడీపీ హయాంలో అత్యంత పేదల నుంచి రూ.500 లబ్ధిదారుని వాటా కింద కట్టించుకున్నారన్నారు. దానికి రూ.3 లక్షల రుణం లబ్ధిదారులు వాయిదాల పద్ధతిలో సంవత్సరాల తరబడి చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో మాత్రం కేవలం వారు చెల్లించిన రూ.500లలో రూ.499 వాపసు చేసి ఒక్క రూపాయికే ఇంటిని అందివ్వబోతున్నామన్నారు. వారు ఎటువంటి నెలసరి వాయిదాలు కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని, తప్పుడు ఆరోపణలు చేసేవారి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

## చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ,జేసీ కె.శ్రీనివాసులు

- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకూడదని, పరిష్కారంలో ప్రజలు సంతృప్తి చెందాలని అన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కానప్పుడు అర్జీదారులను పిలిచి ఎందుకు పరిష్కారం కావడం లేదో వివరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఉమాదేవి, చెన్నయ్య, లోకేశ్వరరావు, నారదముని ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ కురిచేడు మండలం పెద్దవరం గ్రామానికి చెందిన గురుస్వామి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి సర్వే నంబర్ 168లో తనకు భూమి ఉందని అయితే ఆ భూమిని మరొకళ్లు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్రమైన విచారణ జరిపి తన భూమిని తనకు ఇప్పించాలని కోరాడు. స్పందించిన కలెక్టర్ సంబంధిత తహశీల్దార్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

■ మద్దిపూడి మండలం వీరారెడ్డిపాలేనికి చెందిన వడ్డెమని శింగయ్య స్పందన అధికారులను కలిసి తన భూమిని ఆన్‌లైన్ చేయడం లేదంటూ ఫిర్యాదు చేశారు. పట్టా నంబర్ 324లో సుమారుగా 10 ఎకరాలు ఉందని, ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఎన్ని సార్లు అధికారులకు తెలిపినా ఫలితం లేదని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

■ తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన చిన్న అంకయ్య స్పందనలో అధికారులను కలిసి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఎటువంటి జీవనాధారం లేని తనకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.



స్పందన హాలు వద్ద క్యూలో అర్జీదారులు

# భూ కబ్జాలను సహించం



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

- నగరంలో భూకబ్జాల వార్తలపై ఎమ్మెల్యే బాలినేని ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కలెక్టర్
- స్పందించిన కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు
- ఆగమేఘాలపై హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

**ఒంగోలు సబర్బన్:** నగరంలో ఎవరు భూ కబ్జాలకు పాల్పడినా సహించేది లేదని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో భూ కబ్జాలపై వస్తున్న వార్తలపై ఆయన మండిపడ్డారు. ఎక్కడ భూ కబ్జాలు జరిగినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరు చేసినా అది బాలినేని అండతో చేస్తున్నారని కొన్ని పత్రికలు కథనాలు రాయటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అలాంటి వార్తలపై తన వివరణ అడిగి రాస్తే పద్ధతిగా ఉంటుందన్నారు. భూ కబ్జాలను టీడీపీ వాళ్లు చేపట్టినా వాళ్లకు కూడా బాలినేని అండగా ఉన్నాడు అని రాస్తున్నారని, ఇది సరి కాదన్నారు. భూ కబ్జాలకు ఎవరినీ ప్రోత్సహించేది లేదని కూడా గుర్తు చేశారు. ఒక ప్రాంతంలో అలాంటిది జరిగిందని తెలిసిన వెంటనే అధికారులకు ఆ సమాచారాన్ని అందజేసి బోర్డులు కూడా పెట్టించామన్నారు. అలాంటి స్థలాలు ఏమైనా ఉంటే స్థానికంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాలులాంటి సౌకర్యాలు కల్పిస్తామే తప్ప కబ్జాలకు ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు.

**చదును చేసిన కొండపై స్థలంలో హెచ్చరిక బోర్డు**

కొండపై ఎస్ఎస్‌పీ అతిథి గృహం సమీపంలో ఖరీదైన ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొండపైన స్థలాన్ని ఎవరో ఆక్రమించుకునేందుకు చదును చేశారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన సీరియస్ అయ్యారు. వెంటనే ఒంగోలు తహశీల్దార్ మురళిని, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావులను అప్రమత్తం చేశారు. వెంటనే ఆ స్థలంలో ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వారిని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సైతం ఈ స్థలం విషయంలో అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. దీంతో వెంటనే ఒంగోలు తహశీల్దార్ మురళి, పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీ కేవీ.వెంకటేశ్వర్లు, పట్టణ సర్వేయర్ ఓ.యల్లమంద రాజు తమ సిబ్బందితో కొండపైన చదును చేసిన స్థలం వద్దకు చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన సర్వే నంబర్లు 1193, 1194/ఏ లోని కొండ పోరంబోకు భూమిగా గుర్తించారు. ఈ సందర్భంగా ఒంగోలు తహశీల్దార్ మురళి మాట్లాడుతూ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొండ ప్రాంతాన్ని చదును చేశారన్నారు. ఈ స్థలం ఆక్రమణకు గురికాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశామని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాలినేని



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి, కార్పొరేషన్ ఏసీపీ వెంకటేశ్వర్లు

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పీఏ పేరుతో మోసం

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే పీఏ పేరుతో బండారు సురేష్ అనే వ్యక్తి ఉద్యోగాలిప్పిస్తానంటూ రూ.6.50 లక్షలు తీసుకున్నాడని బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన పుల్లారావు, అశోక్‌కుమార్, అనిల్ సోమవారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. సురేష్ అనే వ్యక్తి ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించడంతో పుల్లారావు రూ.3 లక్షలు, అశోక్‌కుమార్ రూ.2.50 లక్షలు, అనిల్ రూ.లక్ష చొప్పున ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడి నుంచి డబ్బు తిరిగి ఇప్పించాలని కలెక్టర్, ఎస్పీని వేడుకున్నారు.

**పీఏలు ఎవరూ లేరు : ఎమ్మెల్యే టీజేఆర్**

పీఏగా చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న సురేష్ గురించి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా తనకు రెండేళ్ల నుంచి పీఏలు ఎవరూ లేరని స్పష్టం చేశారు. డబ్బు వసూలు చేసిన వ్యక్తితో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.



- పోలీస్ అధికారులంతా ఆ దిశగా కృషి చేయాలి
- ఎస్పీ మలికా గర్గ్ స్పష్టీకరణ
- స్పందనలో 99 ఫిర్యాదులు

# ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికా గర్గ్



ఎస్పీ ఛాంబర్ వద్ద వేచి ఉన్న ఫిర్యాదుదారులు

ఒంగోలు సిటీ: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లాలోని పోలీస్ అధికారులు కృషి చేయాలని ఎస్పీ మలికగర్గ్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 99 మంది బాధితుల నుంచి ఎస్పీ మలికగర్గ్ అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, వారి సమస్యల పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధించి ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**స్పందన ఫిర్యాదుల్లో కొన్ని..**

- ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి ముంబైకి చెందిన ఇన్‌స్టా ట్రాన్స్‌ఫర్ బిజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి కొరియర్ అండ్ లాజిస్టిక్స్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా లైఫ్ టైం వ్యాలిడిటీతో త్రిపురాంతకంలో ఫ్రాంచైజ్ ఇస్తామని తన వద్ద నుంచి విడతల వారీగా రూ.1.75 లక్షలు తీసుకుని, త్రిపురాంతకంలో కొరియర్ పాయింట్ ఇవ్వకుండా మరో ప్రాంతం నుంచి పార్శిళ్లు తెచ్చుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారని, కట్టిన డబ్బు తిరిగివ్వమంటే ఇవ్వడం లేదని త్రిపురాంతకం మండలానికి చెందిన వెంకట నరసమ్మ అనే మహిళ ఫిర్యాదు చేశారు.
- తన కుమారిడికి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని ఒంగోలుకు చెందిన వి.వెంకటేష్ అనే వ్యక్తి తన వద్ద నుంచి విడతల వారీగా రూ.4.60 లక్షలు డబ్బు తీసుకుని మోసం చేశాడని ఒంగోలుకు చెందిన ఎం.వాసుదేవరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- పామూరుకు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తమ లేఔట్లో ప్లాట్లు ఉన్నాయని నమ్మబలికి రూ.2 లక్షలు తీసుకుని రెండు ప్లాట్లు నకిలీ రిజిస్ట్రేషన్ చేశాడని, తర్వాత పూర్తిగా విచారించగా ఆ ప్లాట్లు అతడివి కావని తెలిసిందని, డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరిస్తున్నాడని పామూరుకు చెందిన పి.ప్రభు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

# మంటగలిసిన మాతృత్వం!

- ఆడశిశువును బస్సులో వదిలిన మహిళ
- అధికారులకు అప్పగించిన ప్రయాణికుడు



పెద్దదోర్నాల వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి

పెద్దదోర్నాల: మాతృత్వం మంటగలిసింది. తల్లి పొత్తిళ్లలో సేద తీరాల్సిన ఆ పసికందు దిక్కూమొక్కూ లేని అనాథగా మారింది. ఏ తల్లికి భారమైందో కానీ బస్సులో ఓ బ్యాగులో దర్శనమిచ్చింది. ఈ సంఘటన మార్కాపురం నుంచి పెద్దదోర్నాల వస్తున్న ఓ ఆర్టీసీ బస్సులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై అంకమ్మరావు కథనం మేరకు సోమవారం మధ్యాహ్నం సమయంలో మార్కాపురం నుంచి ఓ బస్సు దోర్నాలకు బయలు దేరింది. ఈ క్రమంలో దరిమడుగు, దేవరాజుగట్టు మధ్యలో ఒక మహిళ బ్యాగుతో బస్సెక్కింది. అనంతరం ఆ మహిళ మార్గమధ్యంలోనే మరో ఊరిలో దిగిపోయింది. ఈ క్రమంలో బస్సులో ఎవరూ పట్టించుకోని ఓ బ్యాగు బస్సులో ప్రయాణిస్తున్న ముస్తఫా అనే వ్యక్తి కంటబడింది. బ్యాగును తెరిసి చూసిన ముస్తఫా ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. బ్యాగులో ఉన్న చిన్నారిని అందరికీ చూపించాడు. బ్యాగులో అప్పుడే పుట్టిన ఆడ పసికందును చూసిన ప్రయాణికులందరూ అయ్యో పాపం అంటూ వాపోయారు. ఈ క్రమంలో పెద్దదోర్నాలకు చేరుకున్న ముస్తఫా పసికందును మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించిన అనంతరం అధికారులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన వైద్యశాలకు చేరుకున్న ఎస్సై అంకమ్మరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భార్గవి పసికందుకు ప్రథమ చికిత్సలు నిర్వహించి అనంతరం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. చిన్నారిని వదిలి వెళ్లిన మహిళ బురఖా ధరించి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షి ముస్తఫా తెలిపారు.

# పొగాకు బేళ్ల దొంగలకు సంకెళ్లు

మద్దిపాడు: ఐటీసీ కంపెనీకి చెందిన పొగాకు బేళ్ల దొంగతనం కేసును మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి ఛేదించారు. మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో ఉన్న సువర్ణ కాటన్, జిన్నింగ్ మిల్‌కు సంబంధించిన గోడౌన్‌ను ఐటీసీ కంపెనీవారు లీజుకు తీసుకుని అందులో వేలంలో కొనుగోలు చేసిన పొగాకు బేళ్లు నిల్వ చేస్తుండగా ఆ పొగాకు బేళ్లలో 6 పొగాకు బేళ్లు కనిపించకపోవడంతో మేనేజర్ రామసాయి మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మద్దిపాడు పోలీసులు విచారణ సాగిస్తూ ఉండగా ఆదివారం సాయంత్రం ఐదుగురు వ్యక్తులు వెల్లంపల్లి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ వెంటనే అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈక్రమంలో వారు ఐటీసీ కంపెనీలో బేళ్లు చోరీ చేసిన విషయాన్ని వెల్లడించారు. దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన అంజిరాజు, చీర్వానుప్పలపాడుకు చెందిన చుండి దేవరాజు, రాపర్ల గ్రామానికి చెందిన షేక్ కాలేషా, రాచవారిపాలెంకు చెందిన గోగుల మూడి వేణుగోపాల్, ముక్తినూతలపాడుకు చెందిన రాయపాటి చిన్న పోలు గోడౌన్ వాచ్‌మెన్ సహాయంతో బేళ్లు చోరీ చేసినట్లు ఎస్ఐ విచారణలో తెలిపారు, గత ఏప్రిల్ నెలలో కూడా ఐదు బేళ్లు దొంగతనంగా తీసుకువెళ్లి బయట అమ్మినట్లు వారు తెలిజేయడంతో వారి నుంచి రూ.2 లక్షల డబ్బు, ఆరు బేళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

# కూలీల ఆటో బోల్తా



ముప్పవరం వద్ద బోల్తా పడిన ఆటో



కూలీల నుంచి సమాచారం సేకరిస్తున్న పోలీసులు

- స్వల్ప గాయాలతో బయటపడిన కూలీలు
- ఏడుగురిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలింపు

కొండపి: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపి మండలంలోని ముప్పవరం సమీపంలో మూల మలుపు వద్ద చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో ఆటోలో 15 మంది కూలీలు ఉన్నారు. గాయపడిన కూలీల్లో ఏడుగురికి కొండపిలో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. పొదిలి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు జరుగుమల్లి మండలం పాలేటిపాడులో నువ్వుల పంట కోసేందుకు ఆటోలో బయలుదేరారు. తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో ముప్పవరం గ్రామం దాటిన తర్వాత మలుపు వద్ద ఆటో అదుపు తప్పి తిరగబడింది. కూలీలందరూ చెల్లాచెదురుగా పడిపోయారు.

స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన కూలీలను కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్ మహేష్ ప్రథమ చికిత్స చేశారు. క్షతగాత్రుల్లో ఇద్దరు పురుషులు, మరో ఐదుగురు మహిళలను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు కొండపి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు.

# గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ ధ్యేయం



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అకవీడులో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లారు.



గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల వల్ల ఆర్థిక చేయూత ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల్లో రుణం ఇప్పిస్తోందని చెప్పారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు చేస్తున్నాయని దుయ్యాబట్టారు. అకవీడులో మూడు రోజుల్లో గ్రామంలోని 1106 గృహాలు తిరిగి 1224 సంక్షేమ పథకాల బుక్‌లెట్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, అకవీడు సర్పంచ్ తలపాటి దేవదానం, ఎంపీటీసీ నందం రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, సూర పాండురంగారెడ్డి, ఓబుల్‌రెడ్డిపల్లె పాండురంగారెడ్డి, బచ్చిగారి లింగన్న, ఊలాపు లింగన్న, రామకృష్ణరెడ్డి, రామ్ భూపాల్‌రెడ్డి, కె.గోపి, అన్నా రంజిత్, ఎంపీడీవో కె.కవితా చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ చిన్న అబ్బాయి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ పాల్గొన్నారు.

# కనిగిరిలో చేతబడి పూజల కలకలం!

- ముగ్గురు అనుమానితులను వెంటాడి పట్టుకున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు
- అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు



స్వాముల వేషాధారణలోని వ్యక్తులను విచారిస్తున్న పోలీసులు

కనిగిరి రూరల్: స్వాముల వేషంలో తరచూ తన ఇంటి వద్దకే వచ్చి భిక్షం అడుగుతుండటంతో.. చేతబడి చేస్తున్నారనే అనుమానంతో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులు సోమవారం ముగ్గురు వ్యక్తులను పోలీసులకు పట్టించారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు గోదావరి జిల్లా రాజోలుకు చెందిన ఇంగువ వెంకటేశ్వర్లు, ఇంగువ దేవేందర్, లోవా పెద్దిరాజు(డ్రైవర్) ఓ కారులో పదో వార్డు పాతూరు బీసీ కాలనీలోని కోప్షన్ సభ్యుడు చింతం శ్రీను ఇంటి వద్దకు వచ్చి జాతకం చెబుతామని, 5 చెంచాల బియ్యం, నగదు ఇవ్వాలని అడిగారు. ఇదే బృందం వారం కిందట కూడా ఇలాగే ఇంటికి వచ్చారు. దీంతో శ్రీను భార్య, కుమారుడికి అనుమానం వచ్చింది. వెంటనే చింతం శ్రీనుతోపాటు బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు ఇంటికి చేరుకునేసరికి ఆ ముగ్గురు వ్యక్తులు కారును వేగంగా వెనక్కి తిప్పి పరారయ్యేందుకు యత్నించారు. చింతం శ్రీను, ఆయన బంధువులు వారిని వెంటాడి పట్టుకుని కారుతో సహా పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా అనుమానితులు ముగ్గురూ శుక్రవారం కనిగిరికి వచ్చి స్థానిక కాటికాపరుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నారు. గత రెండు రోజులుగా కనిగిరిలో తిరుగుతూ జాతకాలు చెబుతూ, భిక్షాటన చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వారిపై ఎటువంటి నేరారోపణలు లేనందున బైండోవర్ చేసి పంపినట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు.

# ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- పొదిలి సీహెచ్‌సీలో రూ.1.62 కోట్లతో నిర్మించిన భవనం ప్రారంభం

పొదిలి రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పొదిలిలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1.62 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. జిల్లా నడిబొడ్డున ఉన్న పొదిలి వైద్యశాలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయడం శుభపరిణామమన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలిలో వైద్యశాలకు నూతన భవనాలు సమకూరాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే సీఎం వైఎస్ జగన్ మార్కాపురం వద్ద రూ.475 కోట్ల అంచనా వ్యయంతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. మెడికల్ కాలేజీ పూర్తయితే పశ్చిమ ప్రకాశం వాసులకు విద్య, వైద్యం అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్రంలో గడిచిన వందేళ్లుగా కేవలం 11 మెడికల్ కాలేజీలే ఉన్నాయని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నూతనంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. పొదిలి సీహెచ్‌సీని 30 పడకల నుంచి 50 పడకలకు మార్చాలంటే ఓపీలు పెరగాల్సి ఉందని, అలాగే సర్జరీలు కూడా ఎక్కువగా చేయాలన్నారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా ఆస్పత్రి సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఎం మూర్తి, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోషఫ్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, పట్టణ కన్వీనర్ నూర్జహాన్, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, ఉడుముల గురువారెడ్డి, గూడూరి వినోద్, బ్రహ్మారెడ్డి, పులిగొర్ల శ్రీనివాసరావు, యక్కలి శేషగిరిరావు, ఫిరోజ్, ఆనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, జాకీర్, డాక్టర్లు ఆనంద్‌బాబు, శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# పంట అధికమైతే నష్టమే..

- రైతులు పొగాకు బోర్డు సూచనలు పాటించాలి
- పండుగుల్ల కొనుగోలుకు ప్రణాళిక రూపొందిస్తాం
- టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

కొండపి/టంగుటూరు: పరిమితికి మించి పొగాకు సాగు చేస్తే రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుందని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. బోర్డు అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించి తద్వారా లాభాలు పొందాలని సూచించారు. ఈ ఏడాది పొగాకు చూర కూడా కొనుగోలు చేయడంతో రైతులకు మంచి ధరలు దక్కాయని పేర్కొన్నారు. సోమవారం కొండపి, టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాలను ఆయన పరిశీలించారు. పొగాకు బేళ్ల వేలం ప్రక్రియను పర్యవేక్షించిన అనంతరం రైతులు, బోర్డు సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టుబాకో బోర్డు ఈడీ మాట్లాడుతూ.. రాబోయే సీజన్లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ గురించి వివరించారు. రైతులు అధికంగా కౌలు చెల్లించి బ్యార్నీలు, పొలాలు తీసుకోవద్దని హితవు పలికారు. ప్రస్తుత ధరలను చూసి వచ్చే సంవత్సరం ఇదే మార్కెట్ ఉంటుందని ఆశించవద్దని చెప్పారు. బోర్డు అనుమతించిన పరిమాణం కంటే పొగాకు అధికంగా సాగుచేసి నష్టాలు కొనితెచ్చుకోవద్దన్నారు. అనధికారికంగా పొగాకు సాగు చేస్తే జరిమానాలు విధిస్తామన్నారు. పొగాకు అక్రమ విక్రయాల్లో సాగుదారులు పాల్గొనవద్దని చెప్పారు. పొగాకు పండుగుల్లను కొనుగోలు చేసేందుకు తగు ప్రణాళిక రూపొందించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. తక్కువ మంది సిబ్బందితోనే ఈ సీజన్‌లో పొగాకు వేలాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గుతోందని, రైతులు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. అనంతరం టుబాకో బోర్డు ఈడీని రైతులు ఘనంగా సన్మానించారు.

ఆయా కార్యక్రమాల్లో పొగాకు బోర్డు సభ్యులు పొద వరప్రసాద్, బొడపాటి బ్రహ్మయ్య, ఆక్షన్ మేనేజర్ దివి వేణుగోపాల్, రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారులు అట్లూరి శ్రీనివాసరావు, ఎస్.రామారావు, రైతు సంఘం నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొండపిలో పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు

## నలుగురు ఎస్సైలు బదిలీ

ఒంగోలు సిటీ: జిల్లాలో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికగర్గ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కంభం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వి.నాగమల్లేశ్వరరావును అర్ధవీడు పోలీస్ స్టేషన్‌కు, ఒంగోలు సీసీఎస్ ఎస్సై బి.నరసింహారావును బేస్తవారిపేటకు బదిలీ చేశారు. బేస్తవారిపేట ఎస్సై కె.మాధవరావును పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు, ఒంగోలు సీసీఎస్ ఎస్సై బి.బ్రహ్మానాయుడును కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పీసీపల్లి ఎస్సై ఎ.నాగేశ్వరరావును డిస్ట్రిక్ట్ వీఆర్‌కు పంపారు.